ట్రిపుల్ఆర్ నిర్మాణానికి కేబినెట్ ఆమోదం

- బనకచర్లపై న్యాయపోరాటం
- మూడు నెలలకోసారి మంత్రివర్గ సమావేశం
- నూతన క్రీడాపాలసీకి గ్రీన్‌సిగ్నల్
- మున్సిపాల్టీలుగా ఇంద్రేశం, జిన్నారం
- మంత్రివర్గం నిర్ణయాలు


మంతివర్గం నిర్ణయాలను మీడియాకు వెల్లడిస్తున్న మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు 201కి.మీ మేర ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. భేటీలో తీసుకున్న నిర్ణయాలను రెవెన్యూ, సమాచారం పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. మంగళవారంతో రైతులందరికీ రైతుభరోసా పూర్తవుతుందని, తొమ్మిది రోజుల్లో రూ. తొమ్మిది వేల కోట్ల మొత్తాన్ని రైతులకు అందజేశామని తెలిపారు. రైతుభరోసా కార్యక్రమం పూర్తయిన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు సచివాలయంలో రైతుల సమక్షంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేబినెట్ నిర్ణయించిందన్నారు. రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల్లోనూ పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

"వ్యవసాయం దండగ కాదు.. పండుగ అనేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తెలంగాణ నీటి వాటాను ఎపికి అప్పగిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారు. బనకచర్ల బంకను మా ప్రభుత్వానికి రుద్దాలని ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రాజెక్టు విషయంలో చట్టపరంగా, న్యాయపరంగా ముందుకెళ్తాం. గోదావరి జలాల్లో ఒక్క చుక్క కూడా వదులుకోవద్దని నిర్ణయం తీసుకున్నాం. గోదావరి జలాల విషయంలో జులై మొదటి వారంలో కేంద్రం వద్ద రాష్ట్ర ప్రభుత్వ వాదనలు వినిపిస్తాం. కాళేశ్వరంపై ఈనెల 30లోపు కమిషన్‌కు పూర్తి వివరాలు ఇవ్వాలని నిర్ణయించాం. కాళేశ్వరానికి గత ప్రభుత్వ మంత్రివర్గ ఆమోదం ఉందా? లేదా? వివరాలు ఇవ్వాలని నిర్ణయించాం" అని పొంగులేటి వివరించారు. నూతన క్రీడా పాలసీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. క్రీడా కోటాలో రిజర్వేషన్లు పెంచాలని, క్రీడాకారులను ప్రోత్సహించేలా పారితోషికాలు ఇవ్వాలని నిర్ణయించింది.

ప్రతి జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటుచేసి డిసెంబర్9న వాటిని ఆవిష్కరించుకోవాలని కేబినెట్ నిర్ణయించింది. రాష్ట్ర పునర్విభజన చట్టంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను రెండు రాష్ట్రాల అధికారుల కమిటీలో చర్చించి పరిష్కరించుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌పాలసీ డాక్యుమెంట్ రూపొందించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం నిపుణులతో సలహా మండలి ఏర్పాటు చేయనున్నారు. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా అన్ని రంగాల్లో సుస్థిర సమ్మిళిత అభివృద్ధికి, అన్ని వర్గాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రిమండలి తీర్మానించింది. పాలనా సంస్కరణల్లో భాగంగా ఇకపై ప్రతి మూడు నెలలకోసారి మంత్రివర్గ సమావేశం నిర్వహిస్తారు. సంగారెడ్డి జిల్లాలో ఇంద్రేశం, జిన్నారం మేజర్ పంచాయతీలను మున్సిపాల్టీలుగా మార్చుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇస్నాపూర్ మున్సిపాల్టీని అప్‌గ్రేడ్ చేయనున్నారు.కొత్త మున్సిపాల్టీల్లో 316 పోస్టుల భర్తీకి కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు త్వరలో వెలువడనున్నాయి. ఎంఎన్‌జె కేన్సర్ ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ప్రముఖ వైద్యులు నూరి దత్తాత్రేయను ప్రభుత్వ సలహాదారుగా నియమించాలని మంత్రివర్గం నిర్ణయించింది.


ధర్నాలో మాట్లాడుతున్న నాగయ్య

గుడిసెలేసుకున్న పేదలకు పట్టాలివ్వాలి

- పేదలకు తక్షణమే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి : నాగయ్య
- జలాల్‌పూర్‌లో గుడిసెల ప్రాంతం సందర్శన
- 25న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పూర్ గ్రామంలో గుడిసెలు వేసుకున్న 150 మంది పేదలకు తక్షణం పొజిషన్ పట్టాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం జలాల్‌పూర్ గ్రామంలో గుడిసెలు వేసుకున్న వారిని సోమవారం ఆయన కలిశారు. ఇండ్లు లేని పేదలు, ఒకే ఇంట్లో ఉన్న రెండు మూడు కుటుంబాలకు సంబంధించిన వారు సర్వే నెంబరు 80లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారు. ఆ గుడిసెల కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం నిర్వహించిన సభలో నాగయ్య మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాదిమంది ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కరికి కూడా సెంటు భూమి ఇండ్ల స్థలాల కోసం పంపిణీ చేయలేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మిగులు భూములు పది లక్షల ఎకరాలకు పైగా ఉన్నాయని తెలిపారు. ఇల్లు లేని వారందరికీ ఇంటి స్థలం, సాగు భూమికి రెండు ఎకరాల చొప్పున పంపిణీ చేయడానికి అవకాశం ఉందని వివరించారు. జలాల్‌పూర్ గ్రామంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్న ప్రతి ఒక్కరికీ పట్టా సర్టిఫికెట్లు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి నిర్మాణం చేసివ్వాలని కోరారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ మాట్లాడుతూ.. జలాల్‌పూర్ గ్రామంలో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వడానికి స్థానిక శాసనసభ్యులు, కలెక్టర్, అధికారులు చొరవ చూపాలని కోరారు. ఈనెల 25న పోచంపల్లి తహసీల్దార్ కార్యాలయం ముందు నిర్వహించనున్న మహాధర్నాలో గుడిసెవాసులు, పేదలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం డివిజన్ మాజీ కార్యదర్శి గూడూరు అంజిరెడ్డి, మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్, సిఐటియు మండల కన్వీనర్ మంచాల మధు, వ్యకాస మండల కార్యదర్శి ప్రసాదం విష్ణు, బీఆర్ఎస్ నాయకులు గోరేటి ప్రదీప్ రెడ్డి, పాలకుర్ల ఆగయ్య పాల్గొన్నారు.

రైతుభరోసాకు రూ.513.83 కోట్లు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతుభరోసా నిధులను మరో రూ.513.83 కోట్లు విడుదల చేసినట్టు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 15 ఎకరాల్లోపు ఉన్న రైతుల ఖాతాల్లోకి రైతుభరోసా నిధులు జమ అయినట్టు చెప్పారు. మొత్తం 67.01 లక్షల మంది రైతుల ఖాతాలలోకి రూ.8,284.66 కోట్ల రైతు భరోసా నిధులు జమ అయినట్టు వెల్లడించారు.



చందానగర్‌లో 'ఆకాష్' కొత్త సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నీట్, జెఇఇ పరీక్షలకు కోచింగ్‌ను ఇచ్చే ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఎఇఎస్ఎల్) కొత్తగా చందానగర్‌లో తమ సెంటర్‌ను తెరిచింది. దీనిని శేరిలింగంపల్లి ఎంఎల్ఎ అరికెపూడి గాంధీ, ఆ సంస్థ స్టేట్ హెడ్ అమీత్ కుమార్ ఉరిటి, ఆపరేషన్ లీడ్ నిశాంత్ శ్రీవాస్తవ లాంచనంగా ప్రారంభించారు.ఈ నూతన క్లాస్ రూమ్ కేంద్రం మెడికల్, ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల అవసరాలను తీర్చడానికి రూపొందించబడిందని ఎఇఎస్ఎల్ చీఫ్ అకడమిక్ ధీరజ్ మిశ్రా తెలిపారు. నీట్, జెఇఇ కోచింగ్‌తో పాటు ఒలింపియాడ్ వంటి పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడానికి ఉద్దేశించిన ఫౌండేషన్ స్థాయి కోర్సులను కూడా ఇక్కడ అందిస్తామన్నారు.

కెడిఎంకు భారత్‌కి ఉడాన్ అవార్డు

ముంబయి : భారత్ కా ఛార్జర్ మహా కుంభ్ కార్యక్రమానికి గాను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నుండి భారత్‌కి ఉడాన్ అవార్డును అందుకున్నట్లు కెడిఎం తెలిపింది. 2025 మహా కుంభ్‌లో భక్తులకు 1080 మొబైల్ ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేసిన కెడిఎం చొరవకు గాను ఈ అవార్డును మంత్రి నితిన్ గడ్కరీ అందించారు.

నేడు రైతు భరోసా విజయోత్సవ సభ

- రైతులనుద్దేశించి మాట్లాడనున్న సిఎం రేవంత్‌రెడ్డి
- సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నిర్వహణ
- సిఎస్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతు భరోసా విజయోత్సవ సభను మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహ ఆవరణలో సాయంత్రం ఆరు గంటలకు నిర్వహిస్తున్నామనీ, రైతులనుద్దేశించి సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతారని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతాపూర్వకంగా ప్రజా ప్రతినిధులు రైతులతో కలిసి వారి వారి నియోజకవర్గాల్లో, మండలాల్లో, గ్రామాల్లో పెద్దఎత్తున పాల్గొని ఈ రైతుపండగను విజయవంతం చేయాలని కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయం ఎదుట నిర్వహించే సభకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..సభలో సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రులు పాల్గొంటారని తెలిపారు. తెలంగాణ రైతులను రాజులుగా చూడాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని నొక్కి చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం తొలకరికి ముందుగానే రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లోనే 67.01 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.8,284.66 కోట్లు జమ చేశామన్నారు. రేపటిలోగా మిగతా వారి ఖాతాల్లోనూ డబ్బులు పడతాయన్నారు. సాగులో ఉన్న ప్రతి ఎకరాకూ రైతు భరోసా చెల్లిస్తున్నామని తెలిపారు. ఇంత తక్కువ వ్యవధిలో పూర్తికావడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమమని చెప్పారు. అందుకే రైతుల సంతోషాలు పంచుకోవడం కోసం రైతు నేస్తం వేదిక ద్వారా మంగళవారం విజయోత్సవ సభ నిర్వహిస్తున్నామన్నారు. యుపిఎ హయాంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ నేతృత్వంలో దేశవ్యాప్తంగా రైతులకు రూ. 70 వేల కోట్లు రుణమాఫీ జరిగితే ..తెలంగాణలో ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ కింద రూ. 21 వేల కోట్లు చెల్లించిందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్న వడ్లకు మద్దతు ధరపై 500 బోనస్ ఇచ్చామనీ, దీని ద్వారా రైతులు అదనంగా రూ. రెండు వేల కోట్లు లబ్ది పొందారని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం కొన్నా, కొనకపోయినా... మార్క్ ఫెడ్ ద్వారా పండిన ప్రతి గింజనూ తమ ప్రభుత్వం సేకరిస్తోందన్నారు. రైతు భరోసా ద్వారా అందుకున్న నిధులను రైతులు పంట పెట్టుబడులకు వాడుకోవాలనీ, మంచి పంటలు పండించుకోవాలని ఆకాంక్షించారు రైతుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలకుపైగా ఖర్చు చేసిందనీ, ఇవేమీ పట్టని ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై విమర్శలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శించారు. మంచిని గ్రహించి దురుద్దేశంతో చేసే విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. సభాస్థలిలో విద్యుత్, తాగునీరు, షామియానాలు, సీటింగ్ కెపాసిటీ, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు, అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు, ప్రిన్సిపల్ సెక్రెటరీ అహమ్మద్ నదీమ్, హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సివి ఆనంద్, అడిషనల్ డిజి (లా అండ్ ఆర్డర్స్) ఎంఎం భగవత్, ట్రాన్స్పోర్ట్ శాఖ కమిషనర్ సురేందర్ మోహన్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, ఐఅండ్‌పిఆర్ కమిషనర్ సిహెచ్ ప్రియాంక, ఉద్యాన శాఖ కమిషనర్ యాస్మిన్ భాష, ఎస్‌పిడిసిఎల్ ఎండి ముష్రాఫ్ అలీ, వ్యవసాయ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిఎస్ రామకృష్ణ, మంత్రి తుమ్మల


కార్యక్రమంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

అమెరికా యుద్ధోన్మాదాన్ని ఖండించండి

- హర్మూజ్ జలసంధి మూసివేత ప్రపంచానికి, భారతదేశానికి నష్టం
- యుద్ధంపై బిజెపి ప్రభుత్వం తన వైఖరిని ప్రకటించాలి : తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సామ్రాజ్యవాద ఆధిపత్యం కోసమే అమెరికా ఇరాన్‌పై దాడులకు పాల్పడుతున్నదని, అమెరికా దాడులు అంతర్జాతీయంగా ఉద్రిక్తతలను పెంచుతున్నాయని, పశ్చిమాసియా దేశాలను అస్థిర పరుస్తాయని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. ఈ యుద్ధాల వల్ల తీవ్రమైన ఆర్థిక సమస్యలు ఏర్పడతాయని, భారతదేశం కూడా తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని తెలిపారు. అమెరికా యుదోన్మాదాన్ని ఖండించాలన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా వైరాలో జరుగుతున్న సిపిఎం రాజకీయ శిక్షణా తరగతులను తమ్మినేని వీరభద్రం ప్రారంభించి మాట్లాడారు. ఇరాన్ అణు ఆయుధాలను తయారు చేస్తుందన్న దానికి ఎలాంటి ఆధారమూ లేదని అంతర్జాతీయ అణు శక్తి సంస్థ (ఐఎఇఎ) డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రాస్సీ, అమెరికా ఇంటిలిజెన్స్ సంస్థలు తెలిపినా ప్రపంచంపై ఆధిపత్యం చెలాయించడం కోసం అమెరికా ఇజ్రాయిల్ సహాయంతో ఇరాన్‌పై దాడులు చేస్తోందని విమర్శించారు. అమెరికా, ఇజ్రాయిల్ దేశాలకు దౌత్య ప్రక్రియపై గౌరవం లేదని, దక్షిణాసియా ప్రాంతంపై యుద్ధాన్ని రుద్దాలని చూస్తున్నాయన్నారు. అమెరికా దుశ్చర్యను రష్యా, చైనా, క్యూబా, వెనిజులా ఖండించినా మన దేశ ప్రధాని మోడీ స్పందించకపోవడం బిజెపి ద్వంద్వ నీతికి నిదర్శనమని అన్నారు. ఇరాన్ హర్మూజ్ జలసంధి మూసివేత నిర్ణయం ప్రపంచ దేశాలకు నష్టం చేస్తుందని, భారతదేశానికీ తీవ్ర నష్టం కలుగుతుందని, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం, ప్రధాని మోడీ ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా దాడులపై తమ వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

బనకచర్లపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

- స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే జరపాలి : జూలకంటి


ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బనకచర్ల నీటి సమస్యపై ప్రభుత్వం వెంటనే అఖిలపక్షం సమావేశం ఏర్పాటు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లిలో జరుగుతున్న రాజకీయ శిక్షణాతరగతుల్లో సోమవారం ఆయన ప్రారంభ ఉపన్యాసం చేశారు. గోదావరి జలాలపై ఎపి ప్రభుత్వం నిర్మించే బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు నీటి జలాలపై అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాల మధ్య వివాదం తలెత్తిన బనకచర్లపై ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. స్థానిక సంస్థల పాలకవర్గాలు లేకపోవడంతో గ్రామాల్లో సమస్యలు తిష్టవేశాయన్నారు. ఎన్నికలు జరగకపోవడంతో కేంద్ర నిధులు రావడం లేదన్నారు. వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, పేదలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

ఎస్‌హెచ్‌జిలకు రూ.150 కోట్ల రుణాలు

- ఇండియన్ బ్యాంక్ మంజూరు



ప్రజాశక్తి - హైదరాబాద్

స్వయం సహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జి)లకు రూ.150 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు ప్రభుత్వ రంగంలోని ఇండియన్ బ్యాంక్ వెల్లడించింది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శివ్ బజరంగ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు ఆ బ్యాంక్‌కి చెందిన తెలంగాణ ఫీల్డ్ జనరల్ మేనేషన్ ప్రాణేష్ కుమార్, హైదరాబాద్ జోనల్ మేనేజర్ కె శ్రీనివాస్, కరీంనగర్ జోనల్ మేనేజర్ పిఎస్ఎస్ సుధాకర్ రావు, మల్కాజ్‌గిరి జోనల్ మేనేజర్ స్వర్ణ ప్రభా సుందర్రాయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జోన్‌లో రూ.50 కోట్లు, కరీంనగర్ జోన్‌లో రూ.55 కోట్లు, మల్కాజ్‌గిరి జోన్‌లో రూ.45 కోట్లు చొప్పున ఎస్‌హెచ్‌జిలకు అందజేశారు. "స్వయం సహాయక సంఘాలు సమాజంలో సమగ్ర ఆర్థికాభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నాయి. మహిళల సాధికారతకు ఇండియన్ బ్యాంక్ నిరంతరం మద్దతును అందిస్తుంది. అర్హత కలిగిన ప్రతీ ఎస్‌హెచ్‌జికి రుణాలను అందించడమే మా బ్యాంక్ లక్ష్యంగా పెట్టుకుంది." అని శివ్ బజరంగ్ సింగ్ తెలిపారు.

నేటినుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

- 26 నుంచి ధ్రువపత్రాల పరిశీలన
- జులై 1 వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం
- 114 పాలిటెక్నిక్ కాలేజీల్లో 29,263 సీట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పాలిటెక్నిక్, డిప్లొమా, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు పాలిసెట్ ప్రవేశాల కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన సోమవారం ఒక విడుదల చేశారు. మంగళవారం నుంచి ఈ నెల 28 వరకు ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం అందుబాటులో ఉంటుందనీ, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించొచ్చని, ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. ఈ నెల 26 నుంచి 29 వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని వివరించారు. అదేనెల 26 నుంచి వచ్చేనెల ఒకటో తేదీ వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముందని పేర్కొన్నారు. వచ్చేనెల నాలుగో తేదీన తొలివిడత పాలిసెట్ ప్రవేశాలకు సంబంధించిన సీట్లను కేటాయిస్తామని తెలిపారు. పూర్తి వివరాల కోసం https://tgpolycet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో 114 పాలిటెక్నిక్ కాలేజీల్లో 29,263 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇందులో డిప్లొమా ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో 6,703 సీట్లు, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో 5,850 సీటుల, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో 5,783 సీట్లు, డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్‌లో 4,008 సీట్లు, డిప్లొమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్‌లో 3,929 సీట్లు అత్యధికంగా ఉన్నాయని వివరించారు. అభ్యర్థులు వీలైనన్ని ఎక్కువ వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలని సూచించారు.

తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్ల రైతు భరోసా

- రాష్ట్ర చరిత్రలోనే ఇదే తొలిసారి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కో ఆర్డినేటర్ల సమావేశంలో రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ. తొమ్మిది వేల కోట్ల రైతు భరోసాను ప్రజా ప్రభుత్వం రైతులకు అందించిందని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు, రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ, రైతులకు ఉచిత కరెంట్, సబ్సిడీ గ్యాస్ సిలిండర్, పేదలకు సన్నబియ్యం వంటి పథకాలను అమలు చేస్తున్నదని గుర్తు చేశారు. రైతుభరోసా అమలుకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అమలు చేస్తున్నట్టు చెప్పారు. గతంలో ఎకరాకు రూ. పది వేలుంటే రూ.రెండు వేలు పెంచి రూ.12 వేల చొప్పున ఇస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో కోటి 49 లక్షల 39 వేల 111 ఎకరాలకు రైతు భరోసా ఇవ్వడం జరుగుతోంది. గతంలో 5,10 ఎకరాలకు మాత్రమే అని పరిమితులు ఉండేదన్నారు. ప్రజా ప్రభుత్వంలో అవేమీ లేకుండా వ్యవసాయ యోగ్యమైన అన్ని భూములకు రైతు భరోసా ఇస్తున్నట్టు తెలిపారు. రైతు భరోసా వేయడం మొదలు పెట్టి కేవలం తొమ్మిది రోజుల్లోనే పూర్తి చేసినట్టు ప్రకటించారు. 16న మొదలు పెట్టామని, 24తో పూర్తవుతుందన్నారు. ముగింపు రోజున రైతు వేదికల వద్ద రైతులను సమావేశ పరిచి, సచివాలయం నుంచి సీఎం, మంత్రులు సందేశాలిస్తారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

సమన్వయంతో పని చేయాలి : మీనాక్షి నటరాజన్

పార్టీలో సీనియర్లు, జూనియర్లు సమన్వయంతో కలిసి పని చేయాలని ఎఐసిసి ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ సూచించారు. రాజ్యాంగ పరిరక్షణకు జై సంవిధాన్ కార్యక్రమంపై అవగాహన పెంచాలని కోరారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత నాయకులదేనని గుర్తుచేశారు. టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ 24న మండల కేంద్రాల్లో సంబురాల్లో రైతులను భాగస్వాములను చేయాలని నాయకులకు సూచించారు. ఈ సమావేశంలో సిడబ్ల్యుసి సభ్యులు వంశీచంద్ రెడ్డి, ఎఐసిసి కార్యదర్శి విశ్వనాథం తదితరులు తదితర నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలెట్ ట్రిబ్యునల్

- చైర్మన్‌గా జస్టిస్ అనుగు సంతోష్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్ బ్యూరో : తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలెట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా జస్టిస్ అనుగు సంతోష్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రెరా చైర్మెన్, సభ్యులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనుగు సంతోష్ రెడ్డి జగిత్యాల జిల్లా జోగన్‌పల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే అనుగు నారాయణరెడ్డి, అనుగు లింగమ్మలకు జన్మించారు. 1991లో న్యాయవాద వత్తిలోకి అడుగుపెట్టారు. 2004లో సీనియర్ సివిల్ జడ్జి, 2010లో డిస్ట్రిక్ట్ జడ్జి, 2013లో సిద్దిపేటలో అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జిగా చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో లా సెక్రెటరీగా నియమితులై తెలంగాణ ఏర్పాటు తర్వాత కూడా 2017 వరకు కొనసాగారు. అనంతరం రంగారెడ్డి జిల్లా డిస్ట్రిక్ట్ జడ్జిగా బాధ్యతలు నిర్వహించి తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. తర్వాత హైకోర్టు జడ్జిగా బాధ్యతలు నిర్వహించారు. సుదీర్ఘ అనుభవం కలిగిన అనుగు సంతోష్‌రెడ్డితో తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలెట్ ట్రిబ్యునల్ మరింత బలోపేతం అవుతుందని భావిస్తున్నారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న సంతోష్ రెడ్డి

సుందరం వెల్త్ విస్తరణ

హైదరాబాద్ : అధిక నికర విలువ, సంపన్న ఖాతాదారులకు సేవలు అందించేందుకు సుందరం వెల్త్‌ను ప్రత్యేక సేవగా విస్తరించినట్లు సుందరం ఫైనాన్స్ వెల్లడించింది. సంపన్న కుటుంబాల ఆర్థిక అవసరాలను తీర్చే లక్ష్యంగా దీన్ని రూపొందించినట్లు పేర్కొంది. సుందరం వెల్త్ విస్తరణ మరింత సమగ్ర ఆర్థిక పరిష్కారాలను అందించనుందని సుందరం ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ హర్ష్ విజి పేర్కొన్నారు.

జిల్లాకు ఇద్దరు డిఇఒలుండాలి

- విద్యాశాఖ సంచాలకులకు టిఆర్‌టిఎఫ్ వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ మాదిరిగా పర్యవేక్షణకు ఒక డిఇఒ, పరిపాలనకు ఒక డిఇఒ, మండలానికీ ఇద్దరు ఎంఇఒలను నియమించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టిఆర్‌టిఎఫ్) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈ నవీన్ నికోలస్‌ను సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్ కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాలలు, విద్యాబోధన పర్యవేక్షణకు ప్రస్తుతం ఉన్న విధానాన్ని పటిష్టపరచాలని కోరారు. కొత్త విధానం అనవసర గందరగోళానికి దారితీస్తుందని పేర్కొన్నారు. 33 జిల్లాలు ఏర్పడినా 21 జిల్లాల్లో డిఇఒ పోస్టులను మంజూరు చేయలేదని తెలిపారు. నూతన మండలాలకు మండల విద్యాధికారుల పోస్టులను కేటాయించలేదని పేర్కొన్నారు.

రేషన్ దరఖాస్తుల విచారణ త్వరగా చేయాలి

- అదనపు సిబ్బందిని కేటాయించాలి
- కేరళ, తమిళనాడు తరహాలో 14రకాల వస్తువులు ఇవ్వాలి : సిపిఎం
- ఎర్రమంజిల్ సివిల్ సప్లరు కార్యాలయం ఎదుట ధర్నా
- డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో రేషన్ కార్డు దరఖాస్తుల విచారణ త్వరగా పూర్తి చేసి అర్హులైన పేదలందరికీ తెల్లరేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలని సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అర్హులైన పేదలందరికీ తెల్ల రేషన్‌కార్డులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని పౌరసరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ.. నగరంలో కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, ఇప్పటికే రేషన్ కార్డుల కోసం ప్రజాపాలన, ఈ సేవలో దరఖాస్తులు పెట్టుకున్నారని తెలిపారు. అర్హులైన వారికి వెంటనే రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం రేషన్ కార్డుల విషయంలో ప్రజలకు చాలా అన్యాయం చేసిందని, బైకు, కారు ఉన్నాయన్న కారణంతో పదేళ్ల కాలంలో రాష్ట్రంలో అనేక రేషన్ కార్డులను తొలగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కుంటి సాకులతో కార్డులు తొలగించే చర్యలు చేపట్టొద్దన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రేటర్ పరిధిలో కొత్త రేషన్ కార్డుల కోసం భారీగా దరఖాస్తులు వచ్చాయని, ఈ దరఖాస్తుల విచారణను సివిల్ సప్లరు సిబ్బంది మాత్రమే చేస్తున్నారని, సిబ్బంది తక్కువగా ఉండటం వల్ల విచారణ ఆలస్యం అవుతోందని తెలిపారు. డిప్యూటీ కమిషనర్ జోక్యం చేసుకొని అదనపు సిబ్బందిని కేటాయించాలని కోరారు. కొత్తగా పెండ్లయిన, పిల్లల పేర్లు నమోదు చేసుకోవాల్సిన, రేషన్ కార్డులు లేని కుటుంబాలు లక్షల సంఖ్యలో ఉన్నాయన్నారు. కొత్తగా పెండ్లయిన ఆడపిల్లలకు తల్లిదండ్రుల రేషన్ కార్డులో ఉన్న పేరు తొలగించుకుంటేనే కొత్త అప్లికేషన్ తీసుకుంటామన్న నిబంధన చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నదన్నారు. ఆరోగ్యశ్రీతోపాటు ప్రభుత్వ పథకాలన్నింటికీ రేషన్ కార్డునే పరిగణలోకి తీసుకుంటున్నారని, అందువల్ల పాత రేషన్ కార్డులో పేరు కట్ అయిన వెంటనే కొత్త రేషన్ కార్డులో నమోదు చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని సిపిఎం పార్టీ కోరుతున్నదని, పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరల నేపథ్యంలో కేరళ, తమిళనాడు రాష్ట్రాలలో ఇస్తున్న విధంగా ప్రతి రేషన్ కార్డుపైనా 14 రకాల వస్తువులు ఇవ్వాలని కోరారు. అనంతరం పార్టీ ప్రతినిధుల బృందం డిప్యూటీ కమిషనర్ చంద్ర ప్రకాష్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. హైదరాబాద్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను రెండు నెలల్లోపు పరిశీలన చేసి అర్హులైన వారికి రేషన్ కార్డులు ఇస్తామని హామీ ఇచ్చారని నేతలు తెలిపారు. ఈ ధర్నాలో సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం శ్రీనివాస్, ఎం శ్రీనివాసరావు, కెఎన్ రాజన్న, కె నాగలక్ష్మి, ఎం దశరథ్, ఎం మహేందర్, నగర కమిటీ సభ్యులు పద్మ, వరలక్ష్మి, జి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెలో పాల్గొంటాం

- జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేసిన జెఎసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జులై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో జీహెచ్‌ఎంసీ కాంట్రాక్ట్ కార్మికులంతా పాల్గొంటున్నారని జీహెచ్‌ఎంసీ ఉద్యోగ, కార్మిక సంఘాల జెఏసీ నాయకులు తెలిపారు. ఈ మేరకు సోమవారం జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. శతాబ్ద కాలంగా కార్మికవర్గం అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చిందని, వాటి అమలుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని తెలిపారు. లేబర్ కోడ్‌లు అమలైతే కార్మిక సంఘాల ఏర్పాటు, కార్మిక హక్కులు హరించబడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వేతనాల పెంపుదలకు కార్మికుల సమిష్టి బేరసారాల శక్తి బలహీనపడుతుందని, ఉద్యోగ భద్రత, ఉపాధికి గ్యారంటీ లేకుండా పోతుందన్నారు. దేశంలోని అన్ని రంగాల కార్మికులతోపాటు జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల స్థితిగతులను సమీక్షించి కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. జిహెచ్‌ఎంసి కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కూడా ఈ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర నాయకులు రెబ్బా రామారావు, నగర నాయకులు అంజాద్‌తోపాటు సిఐటియు, ఐఎన్‌టియుసి, ఐఎటియుసి, హెచ్‌ఎంఎస్, బిఆర్‌టియు, ఐఎఫ్‌టియు, టిఎన్‌టియుసి, ఎఐయుటియుసి నాయకులు పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డు స్థలాలకు రికార్డు స్థాయిలో డిమాండ్

- హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ గౌతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాల్లోని హౌజింగ్ బోర్డుకు చెందిన భూములు బహిరంగ వేలంలో మరోసారి రికార్డు స్థాయి ధరలు పలికాయని తెలంగాణ హౌజింగ్ కమిషనర్ విపి.గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. చింతల్, గచ్చిబౌలి, నిజాంపేట తదితర ప్రాంతాల్లో వివిధ ప్లాట్లకు సోమవారం హౌజింగ్ బోర్డు ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించినట్టు తెలిపారు. మొత్తం 11 ప్లాట్లను వేలం వేయగా రూ.65.02 కోట్ల మేర ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. గచ్చిబౌలి ప్రాంతంలోని ఓ కమర్షియల్ ప్లాట్‌ను ఏకంగా రూ.33 కోట్లకు కొనుగోలు చేయడానికి ముందుకొచ్చారని తెలిపారు, మరో చోట ఇంకో ప్లాటు రూ.13.51 కోట్లు పలికిందని చెప్పారు. రెండు ఎంఐజీ ప్లాట్లను రూ.4.50 కోట్లకు పైగా వెచ్చించి బహిరంగ వేలంలో దక్కించుకోడానికి కొనుగోలు దారులు పోటీపడ్డారని అన్నారు.. అలాగే చింతల్ ప్రాంతంలోని ప్లాటును భారీ దర వెచ్చించి కొనుగోలు చేశారని తెలిపారు.

ఇఎన్‌టి, సరోజినీ దేవి ఆస్పత్రుల వైద్యులకు అభినందనలు

- మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అరుదైన, క్లిష్టమైన సర్జరీ చేసి రోగి ప్రాణాలు కాపాడిన ఇఎన్‌టి హాస్పిటల్, సరోజిని దేవి కంటి ఆస్పత్రి వైద్యులను వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. ఈ మేరకు సోమవారం మంత్రి ట్వీట్ చేశారు. వికారాబాద్ జిల్లా రాపోలే గ్రామానికి చెందిన రాజేందర్ అని వ్యక్తికి కంట్లో నుంచి ముక్కులోకి కత్తి దిగింది. ప్రయివేట్ హాస్పిటల్స్ వైద్యులు చేతులు ఎత్తేయడంతో, కుటుంబ సభ్యులు అతడిని ప్రభుత్వ ఈఎన్‌టీ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. ఈఎన్‌టీ హాస్పిటల్ వైద్యులు పేషెంట్‌ను పరీక్షించి, సుమారు నాలుగు అంగుళాలు కత్తి కంట్లో నుంచి, ముక్కులోకి దిగినట్టు గుర్తించారు. ఇఎన్‌టి హాస్పిటల్ సూపరింటెండెంట్ ఆనందాచార్య, సరోజినిదేవి ఐ హాస్పిటల్ సూపరింటెండెంట్ మోదిని నేతృత్వంలోని డాక్టర్ల బందం రాజేందర్‌కు ఆపరేషన్ చేసి కత్తిని బయటకు తీశారు. ప్రస్తుతం రాజేందర్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు.

బిసిల గురించి మాట్లాడే అర్హత కవితకు లేదు: మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

బిసిలకు అన్యాయం జరుగుతున్నా బీఆర్ఎస్ హయాంలో పదేళ్లు మౌనంగా ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఆ వర్గాల గురించి మాట్లాడే అర్హత లేదని రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ బిల్లు గురించి ప్రధానమంత్రి నరేంద్రమోడీ అపాయింట్ మెంట్ తీసుకుంటే అందరం కలిసి వస్తామని రాజ్యసభ సభ్యులు, బిసి నేత ఆర్ కృష్ణయ్యను కోరారు. రాహుల్‌గాంధీ బీసీ విజన్ గురించి బల్లగుద్ది చెబుతున్నారనీ, పార్లమెంటులోనూ తన వైఖరిని స్పష్టం చేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నాయని చెప్పారు. బలహీనవర్గాలను పట్టించుకోని కవితతో ఆర్ కృష్ణయ్య మాట్లాడటం, మద్ధతివ్వడం సమంజసం కాదని మంత్రి అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో 56 శాతం బిసిలున్నారని స్పష్టం చేశారు. బిల్లును గవర్నర్‌కు పంపించిన విషయాన్ని గుర్తుచేశారు.

ఇరాన్‌పై అమెరికా దాడులకు వామపక్షాల ఖండన

- నేడు అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇరాన్‌పై సామ్రాజ్యవాద అమెరికా చేసిన బాంబుదాడులను అఖిల భారత వామపక్ష పార్టీలు ఖండించాయి. ఆ దాడులను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేయాలని పిలుపునిచ్చాయి. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో మంగళవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని తెలంగాణ వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, ప్రజాతంత్రవాదులు, ప్రపంచ శాంతి కోరుకునే వారు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశాయి. సోమవారం హైదరాబాద్‌లో వామపక్ష పార్టీల సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో జాన్‌వెస్లీ (సిపిఎం), కూనంనేని సాంబశివరావు (సిపిఐ), పి సూర్యం (సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ), పోటు రంగారావు (సిపిఐఎంఎల్ మాస్‌లైన్), గాదగోని రవి (ఎంసిపిఐయూ), ఎం రమేష్‌రాజా (సిపిఐఎంఎల్ లిబరేషన్), సిహెచ్ మురహరి (ఎస్‌యుసిఐసి), జానకి రాములు (ఆర్‌ఎస్‌పి), బి సురేందర్‌రెడ్డి (ఫార్వర్డ్‌బ్లాక్), ప్రసాదన్న (సిపిఐఎంఎల్) తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. అంతర్జాతీయ చట్టాలను బేఖాతరు చేసి ఇరాన్ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసేలా అమెరికా ఈ దాడులకు పాల్పడుతున్నదని విమర్శించారు. ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేస్తున్నాయనడానికి ఎలాంటి ఆధారాల్లేవంటూ అంతర్జాతీయ అణుశక్తి సంస్థ, అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థలు వెల్లడించినా అణ్వాయుధాలను తయారు చేస్తున్నదనే నెపంతో ఇరాన్‌పై దాడికి పూనుకోవడం ఉద్రిక్తతలను రెచ్చగొట్టడమేనని పేర్కొన్నారు. ఇరాన్‌ను ధ్వంసం చేయడం, పశ్చిమాసియాపై సామ్రాజ్యవాద ఆధిపత్యం చెలాయించడానికే అమెరికా ఈ దుశ్చర్యలకు పాల్పడుతున్నదని విమర్శించారు. ఇది ప్రపంచశాంతికి భంగం కలిగించడంతోపాటు, పశ్చిమాసియాపై ఆధారపడుతున్న భారత్ వంటి దేశాలు, కార్మికులు, సాధారణ ప్రజల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని తెలిపారు. సామ్రాజ్యవాద అమెరికా దుశ్చర్యను భారత ప్రభుత్వం ఖండించాలనీ, అమెరికా-ఇజ్రాయిల్ అనుకూల విదేశాంగ విధాన వైఖరిని విడనాడి, యుద్ధాన్ని ఆపడంలో భాగస్వామి కావాలని వారు డిమాండ్ చేశారు. శాంతిని కోరుకునే వారంతా సామ్రాజ్యవాద అమెరికా దాడులను ఖండించాలని కోరారు.

సెక్యూరిటీ గార్డుల కొనసాగింపు ఉత్తర్వులు ఏడాదికోసారివ్వాలి

- జూలై తొమ్మిది సమ్మెలో పాల్గొంటాం
- వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకులకు సమ్మెనోటీసు ఇచ్చిన సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సెక్యూరిటీ గార్డుల కొనసాగింపు ఉత్తర్వులు నెలానెలా ఇవ్వడం సరిగాదనీ, ఏడాదికి ఒకేసారి ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డుల రాష్ట్ర కమిటీ(సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది. ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. తదనంతరం వ్యవసాయ శాఖ సంచాలకులు కె.సురేంద్ర మోహన్‌కు సమ్మె నోటీసు అందజేసింది. సంచాలకులు స్పందిస్తూ సంవత్సరానికి కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామనీ, ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అమలు చేస్తామని హామీనిచ్చారు. వినతి పత్రం అందించిన వారిలో ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల సాంబయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాటల సోమన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు గొంగిడి లక్ష్మణ్, రాష్ట్ర కమిటీ సభ్యులు బొట్ల వెంకటేష్, తదితరులున్నారు. ఈ సందర్భంగా యాటల సోమన్న మాట్లాడుతూ..రాష్ట్రంలోని 192 వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన సుమారు 1,200 మంది సెక్యూరిటీ గార్డులు 30 ఏళ్ల నుంచి మార్కెట్ యార్డులు, చెక్‌పోస్టులు, కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. గతంలో వారికి ఏడాదికోసారి కొనసాగింపు ఉత్తర్వులు ఇచ్చేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రతి నెలా కొనసాగింపు ఉత్తర్వులు ఇస్తున్నారనీ, దీంతో వచ్చే నెల తమ ఉద్యోగం ఉంటుందో ఊడుతుందో అన్న అభద్రతా భావంలో సెక్యూరిటీ గార్డులున్నారని వాపోయారు.

బోనాల ఉత్సవాల్లో చేతివృత్తుల ఎగ్జిబిషన్

- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బోనాల ఉత్సవాల సందర్భంగా ఈ నెల 25 నుంచి 29 వరకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బిసి చేతివృత్తుల కళాకారులు తయారు చేసిన వివిధ వస్తువుల ప్రదర్శనను నిర్వహించనున్నట్టు బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభావకర్ తెలిపారు. ఈ ప్రదర్శనలో కుమ్మరులు తయారుచేసిన మట్టిపాత్రలు, గౌడన్నలచే 'నీరా' స్టాల్, మేదరుల వెదురు వస్తువులు, పూసలవారి సామగ్రి అలాగే పోచంపల్లి, గద్వాల, నారాయణ పేట మొదలైన చేనేత ఉత్పత్తులు, ఇతర వృత్తిదారులు తయారుచేసిన వస్తువులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. తెలంగాణ వంటకాలు, బెస్త సోదరులచే చేప వంటకాలు, ఇతర భోజన స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం పది గంటల నుండి రాత్రి 9:30 వరకు ఉంటుందని తెలిపారు.

థర్డ్ జెండర్ జడ్జిమెంట్ అమలు

- ట్రాన్స్‌జెండర్ పీపుల్స్ అసోసియేషన్, టిపిఎస్‌కే నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హిజ్రాల హక్కుల కోసం రాష్ట్రంలో థర్డ్ జెండర్ జడ్జిమెంట్‌ను అమలు చేయాలని ట్రాన్స్‌జెండర్ పీపుల్స్ అసోసియేషన్, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం నాయకులు కోరారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం టిపిఎస్‌కే హాల్‌లో ట్రాన్స్‌జెండర్స్ పీపుల్స్ అసోసియేషన్ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ట్రాన్స్‌జెండర్ హక్కుల యాక్టివిస్ట్ రచన ముద్రబోయిన మాట్లాడుతూ.. పెరుగుతున్న హిజ్రా జనాభాకు తగినన్ని కనీస వసతులు తెలంగాణ ప్రభుత్వం నేటికీ కల్పించలేదని తెలిపారు. ఇళ్లు లేవు, ఉపాధి లేదు, హిజ్రాలంటే? అడుక్కోవడం, వ్యభిచారం చేయడమేనా? మనుషుల్లా మమ్మల్ని గుర్తించండి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రోటి, కపడా, మకాన్ సమకూర్చటంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు.

హిజ్రాల సముదాయం కనీస అవసరాల సాధనలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, గౌరవంగా, ఆత్మాభిమానంగా ఉండాలని సూచించారు. శుభకార్యాలలో అసభ్యకరంగా ప్రవర్తించొద్దని హిజ్రా గురువుల సమక్షంలో నిర్ణయం తీసుకున్నారు. హిజ్రా సంస్కృతి దిగజారకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

నగ్న సంస్కృతిని పూర్తిగా నిషేధించాలని, మనం గౌరవంగా ఉంటూ ప్రజలకు గౌరవాన్ని ఇవ్వాలని, ప్రజలకు ఎప్పుడూ జవాబుదారీగా ఉండాలని చెప్పారు. అప్పుడు మాత్రమే ప్రజలు తమను గౌరవిస్తారన్నారు. తెలంగాణ ట్రాన్స్‌జెండర్ అండ్ హిజ్రా అసోసియేషన్ నాయకులు మోనాలిసా మాట్లాడుతూ.. రాష్ట్రం అవతరించి 11 సంవత్సరాలైనా.. ఇద్దరు ముఖ్యమంత్రులు మారినా ట్రాన్స్‌జెండర్స్ సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. సుప్రీంకోర్టు వెలువరించిన థర్డ్ జండర్ జడ్జిమెంట్ రాష్ట్రంలో అమలు చేయాలని కోరామని, తెలంగాణ హైకోర్టును కూడా సంప్రదించామని కానీ అమలుకు నోచుకోలేదన్నారు.

టిపిఎస్‌కె రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్ అమలులో జాప్యం జరుగుతోందన్నారు. అమలుకు తెలంగాణ ప్రభుత్వం వెంటనే మార్గదర్శకాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో, షీ టీంలో ప్రైడ్ ప్లస్ ట్రాన్స్‌జెండర్ వారికి ప్రత్యేక లీగల్ క్లినిక్ ఏర్పాటు చేయాలని, మరిన్ని పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హిజ్రా అండ్ ట్రాన్స్‌జెండర్ అసోసియేషన్ నాయకులు ఆర్ జస్మిన్ జి గంగ, సోనీ అనిత తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రచన ముద్రబోయిన

అడవి మీదకూ బుల్డోజర్లు

- ఆదివాసీలపై అమానుషం
- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మీదకే కాదనీ, అడవి మీదకూ బుల్డోజర్లు వెళ్తున్నాయని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి తారక రామారావు విమర్శించారు. పేదలు అన్న ప్రేమ లేదనీ, ఆడబిడ్డలు అన్న ఇంగితం లేదని సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. పోడు భూముల్లో వ్యవసాయం చేసి పొట్టపోసుకుంటున్న ఆదివాసీల మీద దాడి జరుగుతున్నదని పేర్కొన్నారు. ఏండ్ల తరబడి సాగు చేసుకుంటున్న ఆదివాసీల మీద దాడి చేయడం అమానుషమని తెలిపారు. 420 హామీలను అమలు చేయకుండా, ఇవ్వని హామీలు హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో హైదరాబాద్‌లో పేదల ఇండ్లను కూల్చుతున్నదని విమర్శించారు. రోడ్ల విస్తరణ, పరిశ్రమలకు భూసేకరణ పేరుతో లగచర్ల, దిలావర్‌పూర్, పెద్ద ధన్వాడ, చారకొండ, సిర్పనగండ్లలో రైతుల పొలాల్లోకి, ఇండ్ల మీదకు బుల్డోజర్లు వెళ్లాయని పేర్కొన్నారు. పట్నం, పల్లెలు దాటి అడవుల మీదా, ఆదివాసీల మీదా కాంగ్రెస్ ప్రభుత్వం పడిందని పేర్కొన్నారు. ప్రశ్నిస్తే, ఎదిరిస్తే, నిలదీస్తే నిర్దాక్షిణ్యంగా కేసులు నమోదు చేస్తున్నారనీ, జైళ్లకు పంపిస్తున్నారని తెలిపారు. 420 హామీలు పక్కకు పోయాయనీ, కూల్చే, కాల్చే కాంగ్రెస్ పథకాలు ముందుకు వచ్చాయని వివరించారు. జాగో తెలంగాణ జాగో అని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అన్ని పథకాలు బంద్

- మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పాలనలో అన్ని పథకాలు బంద్ అయ్యాయని మాజీ మంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. బిఆర్‌ఎస్ పథకాలను కాంగ్రెస్ సర్కార్ అటకెక్కించిందని ఒక ప్రకటనలో విమర్శించారు. మేనిఫెస్టోలో ఊదరగొట్టిన హామీల అమలును గాలికొదిలేశారని తెలిపారు. రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటితే చేతలు గడప కూడా దాటటం లేదని ఎద్దేవ చేశారు. ప్రజలను నమ్మించడం, నయవంచన చేయడంలో కాంగ్రెస్ బ్రాండ్ అంబాసిడర్ అని విమర్శించారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందే

- ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాల్సిందే
- కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జులై 9న సార్వత్రిక సమ్మె
- కార్మికులంతా జయప్రదం చేయాలి : ఆల్ ట్రేడ్ యూనియన్ల నేతలు



అభివాదం చేస్తున్న ఆల్ ట్రేడ్ యూనియన్ల నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందేననీ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాల్సిందేనని కేంద్ర, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మిక పోరాటాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేస్తూ జులై 9న దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని హెచ్‌ఎంఎస్ ఆఫీసులో ఉదయ్ భాస్కర్ అధ్యక్షతన కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు, అసోసియేషన్ల రాష్ట్ర సదస్సు జరిగింది. ఆర్.డి. చంద్రశేఖర్, విజయ్‌కుమార్ యాదవ్ (ఐఎన్‌టియుసి), ఎస్.బాల్‌రాజ్, ఎం.నర్సింహ (ఎఐటియుసి), శంకర్‌రావు, రెబ్బా రామారావు, అంజాద్ (హెచ్‌ఎంఎస్), పాలడుగు భాస్కర్, జె వెంకటేష్, కుమారస్వామి (సిఐటియు), ప్రవీణ్ (టియుసిఐ), అనూరాధ (ఐఎఫ్‌టియు), ఎంకె. బోస్, ప్రసాద్ (టిఎన్‌టియుసి), వి నాగేశ్వరరావు (సీజీ కాన్ఫెడరేషన్ అధ్యక్షులు) తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ..11 ఏళ్ల ఎన్‌డిఎ ప్రభుత్వం తన కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల, మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా అమలు చేస్తోందని విమర్శించారు. పోరాటాల ద్వారా సాధించుకొన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను ముందుకు తెచ్చిందనీ, దీనికి వ్యతిరేకంగా కార్మిక సంఘాలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సామాజిక సంక్షేమానికి కోతలు పెడుతున్న తీరును ఎండగట్టారు. సామాన్యులపై భారాలు మోపి కార్పొరేట్ గుత్త సంస్థలకు, పెట్టుబడిదారులకు వేల కోట్ల రాయితీలు ప్రకటించడాన్ని తప్పుబట్టారు. ఉపాధి, నిరుద్యోగం, అధిక ధరలు, ఆకలి, అసమానతలు, ఆరోగ్య రక్షణ లాంటి ప్రాథమిక సమస్యలను మోడీ సర్కారు విస్మరిస్తోందన్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు రాష్ట్ర కార్మికవర్గం పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. జులై తొమ్మిది సమ్మె కోసం తలపెట్టిన కార్యాచరణను జె వెంకటేష్ (సిఐటియు) ప్రవేశపెట్టారు. శ్రీనివాస్ (ఎఐటియుసి) వందన సమర్పణ చేశారు.

బస్ బుకింగ్స్‌లో 30 శాతం వృద్ధి : రెడ్‌బస్ వెల్లడి

హైదరాబాద్ : గడిచిన ఆర్థిక సంవత్సరం 2024-25లో తెలుగు రాష్ట్రాల్లో సమిష్టిగా బస్ బుకింగ్‌లో 30 శాతం వృద్ధి నమోదయ్యిందని ప్రముఖ ఆన్‌లైన్ బస్ బుకింగ్‌యాప్ రెడ్ బస్ వెల్లడించింది. హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-విజయవాడ, తిరుపతి-బెంగళూరు, విశాఖపట్నం-హైదరాబాద్ అత్యంత రద్దీగా ఉండే మార్గాల్లో ఉన్నాయని పేర్కొంది. ఇందులో హైదరాబాద్ ప్రధాన రవాణా కేంద్రంగా నిలిచిందని పేర్కొంది. 56 శాతం మంది ప్రయాణికులు ఒక్క రోజు ముందు బుకింగ్ చేసుకోగా.. 40 శాతం మంది 1-7 రోజులు ముందు బుకింగ్స్‌ను చేసుకున్నారని రెడ్‌బస్ సిఎంఒ పల్లవి చోప్రా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎల్లప్పుడూ ఇంటర్‌సిటీ ప్రయాణంలో ముందంజలో ఉన్నాయన్నారు.

హెల్త్ డయాగ్నోస్టిక్ సేవల్లోకి అమెజాన్

న్యూఢిల్లీ : దేశంలో హెల్త్ డయాగ్నోస్టిక్ సేవలను ప్రారంభిస్తున్నట్లు అమెజాన్ ఇండియా వెల్లడించింది. రోగ నిర్ధారణ కోసం వినియోగదారుల నుంచి శాంపుల్స్‌ను వారి ఇళ్లలోనే సేకరించనున్నట్లు పేర్కొంది. ఈ సేవలను హైదరాబాద్ సహా 6 నగరాల్లో ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. ఇందుకోసం అమెజాన్ డయాగ్నోస్టిక్స్ విభాగాన్ని ప్రారంభిస్తున్నామని, ఇది అమెజాన్ యాప్‌లోనే ఉంటుందని తెలిపింది. ఈ సేవలను ఆరెంజ్ హెల్త్ ల్యాబ్స్‌తో కలిసి హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ, గురుగ్రామ్, నోయిడా, ముంబయిలలో 450 పిన్‌కోడ్ ప్రాంతాల్లో ప్రారంభించనున్నట్లు సంస్థ వెల్లడించింది. 800కు పైగా రోగనిర్ధారణ పరీక్షల కోసం, ఆర్డర్ ఇచ్చిన 60 నిమిషాల్లో ఇంటి దగ్గరే శాంపిల్స్ సేకరించనున్నట్లు వెల్లడించింది.